సాక్షి
నల్లగొండ
శనివారం । 7 । డిసెంబర్ । 2024



మరుగున పడిన చరిత్ర
కృష్ణానది తీరంలో చారిత్రక సంపద బయటపడుతున్నా వాటి గొప్పతనాన్ని వెలుగులోకి రావడం లేదు. - 8లో



కులవ్యవస్థే అభివృద్ధికి ఆటంకం
కులవ్యవస్థ మన దేశంలోనే ఉందని.. అది అభివృద్ధికి ఆటంకంగా మారిందని మంద కృష్ణమాదిగ అన్నారు. - 8లో



సీఎం పర్యటనకు బందోబస్తు
సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. - 8లో

అభివృద్ధికి సహకరించాలి



నల్లగొండలోని మెడికల్ కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

- మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్
- బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, నల్లగొండలో మెడికల్ కళాశాల, సీఎం సభాస్థలి పరిశీలన
- సీఎం సభకు పార్టీలకతీతంగా తరలిరావాలని పిలుపు

నల్లగొండ : నల్లగొండ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు పార్టీలకతీతంగా తరలివచ్చి అభివృద్ధికి అండగా ఉండి సహకరించాలని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంత్రాలను సందర్శించారు. ముందుగా వారు హెలికాప్టర్ ద్వారా బ్రాహ్మణవెల్లెంల వచ్చి అక్కడ ప్రాజెక్టు పరిశీలించారు. అనంతరం నల్లగొండ వచ్చి మెడికల్ కళాశాల, సెమినార్ హాల్, బాలికల, బాలుర హాస్టళ్లను పరిశీలించారు. అనంతరం 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సీఎం పాల్గొనే బహిరంగ సభాస్థలిలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి శనివారంతో ఏడాది గడుస్తున్న సందర్భంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కాలంలో ఎంపీ ఎన్నికలు మూడు మాసాలు పోతే 9 నెలల్లోనే ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. నల్లగొండలో రూ.600 కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులు పురోగతిలోకి వచ్చాయన్నారు. మూడేళ్లలో ఎల్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తవుతుందని చెప్పారు. తాను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా పెద్దఎత్తున నిధులు తెప్పించి జిల్లాను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మలమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

నార్కట్‌పల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ప్రాజెక్టును ఈ నాలుగు ఏళ్ల కాలంలో పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారు. ఈ ప్రాజెక్టు వద్ద శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించే పైలాన్‌ను పరిశీలించారు. పనుల వివరాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి, నీటి పారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్ మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులపై గత ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో నేటికీ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. 2007లో కాంగ్రెస్ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేత శంకుస్థాపన చేయించిన బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును మంత్రి కోమటిరెడ్డి పట్టుదలతో పూర్తిచేయించారని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని గతంలో ఉన్న సీఎం కేసీఆర్‌ను ఎన్నిసార్లు కలసినా పూర్తి చేయలేదన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును 17 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. అంతకుముందు హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, ఈఈ గంధం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ విఠలేశ్వర్, తహసీల్దార్ వెంకటేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జెర్రిపోతుల భారత్, గోపాల్‌రెడ్డి, మల్లేశం, బొడిగె స్వామి తదితరులు ఉన్నారు.



బ్రాహ్మణవెల్లెంల పైలాన్ వద్ద మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

- వైటీపీఎస్‌ను పరిశీలించిన మంత్రులు



పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లోని యూనిట్–2ను ప్రారంభించనున్నందున.. చేసిన ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ప్రజలకు అన్ని పథకాలను వర్తింప చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పవర్‌ప్లాంట్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్–2ను ప్రారంభిస్తారని, ఇది జిల్లా చరిత్రలో నిలిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ఎస్ఈ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటిసారి నల్లగొండకు సీఎం

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వస్తున్న రేవంత్‌రెడ్డి



నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ వద్ద సిద్ధమవుతున్న సభావేదిక

- బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు, మెడికల్ కాలేజీ భవనాల ప్రారంభోత్సవం
- యాదాద్రి పవర్ ప్లాంట్ రెండవ యూనిట్‌లో విద్యుదుత్పత్తి..
- లైబ్రరీ, నర్సింగ్ కాలేజీ భవనం, మరో మూడు ఎత్తిపోతలకు శంకుస్థాపన
- ఎల్ఎల్‌బీసీ వద్ద బహిరంగ సభ..



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటిసారిగా నల్లగొండ జిల్లాకు వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన.. సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి రాబోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఈ సందర్భంగా శనివారం జిల్లాలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేసిన బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంతోపాటు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రెండో యూనిట్ విద్యుత్ ఉత్పత్తిని, నల్లగొండలో మెడికల్ కాలేజీ భవనాలను సీఎం ప్రారంభించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే నల్లగొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సభలో జిల్లాపై సీఎం వరాలు కురిపిస్తారన్న జిల్లా ప్రజలు ఆశతో ఉన్నారు.

బ్రాహ్మణవెల్లెంల ప్రారంభం

నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో నిర్మించిన బ్రాహ్మణవెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్‌లో బ్రాహ్మణవెల్లెంలకు చేరుకుంటారు. అక్కడ రిజర్వాయర్‌లోని నీటిని ఎత్తిపోసే పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. నల్లగొండ నియోజకవర్గంలో రూ.6.835 కోట్లతో పానుగోడు ఎత్తిపోతల పథకానికి, రూ. 16.95 కోట్లతో నర్సింగ్‌భట్ల–దోమలపల్లి ఎత్తిపోతల పథకానికి, రూ.20.22 కోట్లతో కంచనపల్లి –బక్కతాయికుంట ఎత్తిపోతల పథకానికి సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

యూనిట్–2లో విద్యుదుత్పత్తి..

బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనుల ప్రారంభం అనంతరం మధ్యాహ్నం 2.55 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.15 గంటలకు దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.20 గంటల నుంచి 3.40 గంటల వరకు ప్లాంట్‌లోని యూనిట్–2లో విద్యుదుత్పత్తిని.. గ్రిడ్‌తో అనుసంధానాన్ని ప్రారంభిస్తారు.

మెడికల్ కళాశాల, హాస్టళ్లు..

సాయంత్రం 4.10 గంటలకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 4.25 గంటలకు నల్లగొండ సమీపంలోని గంధంవారిగూడెం వద్దనున్న మెడికల్ కాలేజీ వద్దకు చేరుకుంటారు. 4.30 గంటల నుంచి 4.50 గంటల వరకు రూ.200 కోట్లతో నిర్మించిన మెడికల్ కాలేజీ భవనంతో పాటు బాలుర, బాలికల హాస్టళ్లను ప్రారంభిస్తారు. ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారు. అక్కడే కనగల్, తిప్పర్తి మండలాల్లో జూనియర్ కాలేజీల భవనాలు, నర్సింగ్ కాలేజీ, లైబ్రరీ, పట్టణంలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఆ తర్వాత ఎస్ఎల్‌బీసీలోని 25 ఎకరాల్లో ఏర్పాటు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. ఆయన వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. సాయంత్రం 6.05 గంటలకు గంధంవారిగూడెం నుంచి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకుంటారు.

న్యూస్‌రీల్

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని బోయవాడ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓఎస్ జానకి రాయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఈటీ, హిందీ టీచర్ పోస్టులకు డిసెంబర్ 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

నల్లగొండ క్రైం : సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సైనికుల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు సంది పాపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్‌కు సాయుధ దళాల పతాకాన్ని అందజేసి విరాళాలు సేకరిస్తామని తెలిపారు. ఆ విరాళాలను వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలకు అందజేస్తామని పేర్కొన్నారు. విరాళం ఇచ్చే వారికి ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

8న ఉచిత యునాని వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిత్య యోగ సాధకులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలో ఈనెల 8న యునాని మెగా హెల్త్, హిజామా క్యాంపు నిర్వహించనున్నట్లు శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ ఏఏ.ఖాన్ తెలిపారు. మెగా హెల్త్ క్యాంపు పోస్టర్‌ను శుక్రవారం నిత్య యోగా సాధకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుభవం గల డాక్టర్లు.. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. స్త్రీలకు మహిళా వైద్యుల చేత కప్పింగ్ థెరపి నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేషనల్ షరీఫ్, యోగా గురూజీ రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్, చొకారపు వెంకన్న, కిషోర్, రాజు, రాము, రవీందర్‌రెడ్డి, శ్రవణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్టోస్పిరోసిస్‌పై అవగాహన

బీబీనగర్: వన్ హెల్త్‌డేను పురస్కరించుకుని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్ బ్యాక్టీరియాలపై అవగాహన కల్పించారు. పరాన్న జీవుల వల్ల స్క్రబ్ టైఫస్ మానవుల్లోకి సంక్రమిస్తుందన్నారు. లెప్టోస్పిరోసిస్ ఎలుకలు, గబ్బిలాల మూత్రంలో ఉంటుందని, ఇది ముక్కు, నోటి ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుందన్నారు. వీటి వల్ల ఇన్‌ఫెక్షన్లు సంభవిస్తాయని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ జులాజికల్ పార్క్ డైరెక్టర్ సునీల్, ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, వైద్యులు బార్బుద్దే, మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్లు రాహుల్ నారంగ్, లక్ష్మి, జ్యోతి, శ్యామల, రుద్రేష్ పాల్గొన్నారు.

ఇక.. తెలంగాణ గ్రామీణ బ్యాంకు



అవగాహన కల్పిస్తున్న విజయభాస్కర్‌గౌడ్

చండూరు : వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు.. తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మారబోతుందని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్‌గౌడ్ తెలిపారు. బ్యాంకు పేరు మార్పిడిపై చండూరు మండల పరిధిలోని నెర్మట గ్రామంలో శుక్రవారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు పేరు మార్పిడిలో భాగంగా ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవల్లో అంతరాయం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఆపరేషన్ సిహెచ్.వెంకటేశం, బ్రాంచి మేనేజర్ ప్రభాకర్, అకౌంటెంట్ రామచంద్రారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశం, క్యాషియర్ సౌందర్య, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిలో రోజూ తాగునీరు!

- రూ.96 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు
- సీఎం, మంత్రులకు అందజేయనున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- యూఐడీఎఫ్ ద్వారా నిధులకు యత్నం



నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణ ప్రజలకు రోజూ తాగునీటిని అందించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. పట్టణంలో ఇప్పటికే రూ.240 కోట్లతో అమృత్ పథకం కింద తాగునీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్లు వేస్తున్న విషయం తెలిసిందే. మరో నలభై సంవత్సరాల్లో పట్టణంలో పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు తాగునీటి సరఫరా కోసం డీపీఆర్ తయారు చేస్తున్నారు. ఆ దిశగానే ఇంటింటికి రోజూ తాగు నీరందించాలంటే మరో రూ.96 కోట్లు అవసరం అని మున్సిపల్ యంత్రాగం ప్రతిపాదనలు రూపొందించింది.

పట్టణంలో 48 వార్డులు..

నీలగిరి మున్సిపాలిటీలో 48 వార్డుల్లో అన్ని కాలనీలకు ఒకేరోజు తాగునీటిని సరఫరా చేయాలంటే ఉదయం సముద్రం నుంచి ఎక్కువ నీటిని తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ట్యాంకుల నిర్మాణం, అంతర్గత పైప్‌లైన్ వేయడం, పంప్‌హౌజ్ వద్ద తగిన ఏర్పాట్లు చేసుకోవడం లాంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. అందుకోసం అదనపు నిధులు అవసరం పడుతున్నాయి. ఇందుకోసం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి వారికి ప్రతిపాదనలు తయారు చేయించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కేంద్రానికి రానుండడంతో ఆ ప్రతిపాదనలు అందజేయనున్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) కింద నిధులు విడుదల చేయాలని సీఎంను కోరనున్నారు.

ఏకాలంలోనైనా సమస్య రాకుండా..

నీలగిరి పట్టణ విస్తీర్ణం భారీగా పెరగడంతో ఎప్పటికప్పుడు కొత్తగా పైప్‌లైన్‌లు వేసినా శివారు కాలనీలకు సరిపడా తాగునీరు అందడం కష్టంగా మారుతోంది. ప్రస్తుతం పట్టణంలో అమృత్ పథకంతో పనులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.96 కోట్లు విడుదల చేస్తే తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. పనులన్నీ పూర్తయ్యాక 48 వార్డుల్లోని ప్రజలకు రోజూ తాగునీరు అందుతుంది. వేసవి కాలం వచ్చినా తాగునీటి సమస్య ఉండదు. ప్రభుత్వం రూ.96 కోట్ల విడుదలపై సానుకూలంగా స్పందిస్తే మరో ఏడాదిలోపే పనులు పూర్తయి ఇంటింటికీ రోజూ తాగునీరు అందించే మున్సిపాలిటీగా నల్లగొండ నిలుస్తుంది.

కనుల పండువగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం కనుల పండువగా నిర్వహించారు.సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలోని వేదికపై అమ్మవారిని తీర్చిదిద్ది ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.అమ్మవారికి ఇష్టమైన నాదస్వరం వినిపించారు.

ప్రధానాలయంలో..

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని ప్రతిష్ఠా అలంకార మూర్తులకు ఆరాధన, అభిషేకం, అర్చన చేశారు. సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవత్సం నిర్వహించారు. వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

నకిరేకల్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం నకిరేకల్ మండలంలోని చందంపల్లి, నెల్లిబండ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో బీజేపీ దిమ్మెలను ఆవిష్కరించి జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన పేరుతో విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో యానాల శంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, బుడిగె సైదులు, నాయకులు గర్రె మురళి, చినేని జాని, కొండేటి శ్రీను, గుడుగుంట్ల సాయన్న, నాగయ్యగౌడ్, రాచకొండ శ్రీను, ఉప్పల నాగరాజు, విక్రంరెడ్డి, చనగాని సైదులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

• మెడికల్.. జిగేల్



నల్లగొండ మెడికల్ కాలేజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్న సందర్భంగా కళాశాల భవనానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సూర్యాపేటకు 'నవోదయ'ం

- జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ
- పేద విద్యార్థులకు వరంగా మారనున్న జేఎన్‌వీ

సూర్యాపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం సూర్యాపేట జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ)ను కేటాయించింది. మొత్తం రాష్ట్రంలో ఏడు నవోదయ విద్యాలయాలు కొత్తగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సూర్యాపేట జిల్లా కూడా ఉండడంతో ఇక్కడి పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరంగా మారనుంది.

కార్పొరేట్ స్థాయిలో విద్యా ప్రమాణాలు..

నవోదయ విద్యాలయంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయిలో విద్యనందించనున్నారు. ఇందులో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఆరో తరగతిలో చేరేందుకు అర్హత పరీక్ష పెడతారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మాత్రమే తీసుకుంటారు. ఇందులు అన్ని సౌకర్యాలతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తారు. ఆరో తరగతి నుంచి పది వరకు ఒక్కో తరగతిలో 80 మందికి ప్రవేశం కల్పిస్తారు. 11, 12 తరగతుల్లో 40 మంది చొప్పున తీసుకుంటారు. అయితే జేఎన్‌వీని జిల్లాలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

కట్టంగూర్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం కల్మెర గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మెర గ్రామానికి చెందిన కట్ట మల్లయ్య(65) తన వ్యవసాయ బావి నుంచి ఇంటికి గ్రామంలోని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. పందెనపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్. పాపయ్య ఆటోలో కట్టంగూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తూ కల్మెర గ్రామ పరిధిలో మల్లయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

భువనగిరి: ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత కుటుంబానికి న్యాయం చేయాలని భువనగిరి–జగదేవ్‌పూర్ ప్రధాన రహదారిపై బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన సుబ్బూరి చంద్రమౌళి, బుచ్చమ్మల కుమార్తె మల్లెల మౌనిక(29) ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త వేధింపుల కారణంగానే మృతి చెందిందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర, సీఐలు సురేష్‌కుమార్, చంద్రబాబు వారితో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

స్వర్ణగిరి ఆలయంలో బ్రహ్మ రథోత్సవం



బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాసాంతర శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ మాడ వీధుల్లో బ్రహ్మ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మురళి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మరుగున పడిన చరిత్ర



ముదిమాణిక్యం గ్రామంలో ధ్వంసమైన విగ్రహం



పురాతన ఆలయం

- కృష్ణా నది తీరంలో బయల్పడుతున్న శాసనాలు, పురాతన ఆలయాలు
- అడవిదేవులపల్లి మండలంలో వెలుగులోకి దీపపు స్తంభ శాసనం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎంను కోరుతున్న స్థానిక ప్రజలు

మిర్యాలగూడ: క్రీ.శ. 1213లో కళ్యాణి చాళుక్యులతో పాటు బాదామీ చాళుక్యులు, కాకతీయుల కాలం నాటి రాచరికపు ఆనవాళ్లు అడవిదేవులపల్లి మండలంలో కృష్ణా నది తీరంలో బయటపడుతూనే ఉన్నాయి. దీపపు స్తంభ శాసనం, పంచకూట ఆలయాలు వంటి అనేక ఆనవాళ్లు ఇక్కడ లభ్యమయ్యాయి. గతంలో ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారు, చరిత్రకారులు వీటిని సందర్శించి వాటి గొప్పతనాన్ని వివరించినప్పటికీ వెలుగులోకి తీసుకురాలేకపోయారు. దీంతో రాజుల కోటలు, నాటి దేవాలయాలు ధ్వంసమై శిథిలావస్థకు చేరుకోని కాలగర్భంలో కలుస్తున్నాయి. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో అడవిదేవులపల్లిలోని నాటి చారిత్రాత్మక వైభవం వెలుగులోకి వస్తుందని గ్రామస్తులు ఆశిస్తున్నారు.

వెలుగులోకి దీపపు స్తంభ శాసనం..

సంవత్సరన్నర క్రితం అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామంలో పురావస్తుశాఖ ముదిమాణిక్యం గ్రామంలోని పురాతన శివాలయం సమీపంలో 20 అడుగుల దీపపు స్తంభ శాసనాన్ని పురావస్తుశాఖ అధికారులు గుర్తించారు. ఈ శాసనం తెలుగు, తమిళ భాషల్లో ఉంది. దీని ఆధారంగా 16వ శతాబ్దంలో ముదిమాణిక్యంను రాజధానిగా చేసుకుని రాజులు పాలన సాగించినట్లు పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నారు. నది ఒడ్డున కాశీ విశ్వనాథుడిని ప్రార్థిస్తున్నట్లు 23 పదాల పద్యాన్ని సైతం కనుగొన్నారు. అదేవిధంగా ముదిమాణిక్యం గ్రామం చివరన కృష్ణా నది ఒడ్డున బాదామీ చాళుక్యుల కాలం నాటి ఆలయాలు రెండు బయల్పడ్డాయి. ఈ ఆలయాలతో పాటు లఘు శాసనాలను పబ్లిక్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ హిస్టర్, ఆర్కియాలజీ, హెరిటేజ్(ప్రిహే)కు చెందిన డాక్టర్ ఎం.ఎ. శ్రీనివాసన్, ఎస్. అశోక్‌కుమార్‌ల బృందం వెలుగులోకి తెచ్చింది. క్రీ.శ 543– 750 సంవత్సరాల మధ్య కాలంలో ఈ ఆలయాలు నిర్మించారని తెలుస్తోంది. 9వ శతాబ్దానికి చెందిన శాసనం వెలుగుచూసింది.

నిధులు కేటాయించి పరిరక్షించాలి



కృష్ణా నదీ తీరంలో ఉన్న పురాతన దేవాలయాలను, కోట గోడలను, దీపపు స్తంభాలను పరిరక్షించాలి. భవిష్యత్ తరాలకు పురాతన సంపదను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– చల్లా శివారెడ్డి, ముదిమాణిక్యం

దేవాలయాలను పునరుద్ధరించాలి

కృష్ణా నదీ తీరంలో ఉన్న పురాతన ఆలయాలను పునరుద్ధరించాలి. చారిత్రక విషయాలను ప్రజలకు తెలిసేలా ఆయా ప్రాంతాల్లో శాసనాలు రాయించాలి. దేవాలయాలు, చారిత్రక కట్టడాలు ధ్వంసం కాకుండా చూడాలి.

– కొండలు, ముదిమాణిక్యం, మాజీ సర్పంచ్

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు



పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సభ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభంతో పాటు నర్సింగ్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన, అదే విధంగా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో ఉదయసముద్రం ప్రాజెక్టు ప్రారంభోత్సవం, దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి పోలీసు సిబ్బందితో ఎస్పీ, ఏఎస్పీ చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఐజీ, డీఐజీ, ఐదుగురు ఎస్పీలు, పది మంది ఏఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 75 మంది సీఐలు, 170 మంది ఎస్‌ఐలు, 2500 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ స్థలాలు, ప్రముఖులు వచ్చే మార్గాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బందికి ప్రజలు సహకరించి వారు సూచించే ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం..

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించిన అనంతరం సాయంత్రం 5గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభకు లక్ష మంది వస్తారని అంచనా. సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ప్రముఖులకు మెడికల్ కలాశాల సమీపంలోనే ఎస్ఎల్‌బీసీలో, బహిరంగ సభా వేదికకు ఎదురుగా సాధారణ ప్రజలకు, డాన్‌బోస్కో కాలేజీ రోడ్డులో రాజకీయ నాయకులకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు నుంచి వచ్చే వారికి డాన్‌బోస్కో కాలేజీ వద్ద, దేవరకొండ రోడ్డు నుంచి వచ్చే వారు నల్లగొండ పట్టణంలోకి రాకుండా కొత్తపల్లి నుంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వ వెంట సాగర్ రోడ్డుకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సభా స్థలంలో వేర్వేరుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభా వేదికను, హెలిపాడ్‌ను బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీ చేశారు. సభ సాయంత్రం 6గంటలకు ముగుస్తుంది. అనంతరం రోడ్డు మార్గాన సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ఆదర్శ పాఠశాలలో కళావేదిక ప్రారంభం



కళావేదికను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో గల శ్రీవేమూరి అభిరామేశ్వరరావు ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో నిర్మించిన డాక్టర్ ఏవీ రమణారెడ్డి మెమోరియల్ కళావేదికను 1983–84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ సభ్యుడు ఏవీ రమణారెడ్డి భార్య సునంద మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. నూతనంగా నిర్మించిన కళావేదికపై విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో భాస్కర్‌బాబు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆదాసు నాగరాణి, పాఠశాల హెడ్మాస్టర్ శేషు, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ కర్నాటి శ్రీదేవి, తిరుమలగిరి(సాగర్)మండల ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

ఆలేరురూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి ఆలేరులో పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలంలోని కంటంగూడెం గ్రామానికి చెందిన కమటం ఎల్లయ్య(62) వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎల్లయ్య గురువారం పని నిమిత్తం బైక్‌పై ఆలేరు పట్టణానికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం సాయంత్రం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈక్రమంలో మార్గమధ్యలో ఆలేరు పట్టణంలోని రఘునాథపురం రోడ్డులో బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అంబేద్కర్‌పై నూతన దంపతుల అభిమానం

- పెళ్లి మండపం నుంచి నేరుగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన వధూవరులు



మునుగోడులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న నూతన దంపతులు

మునుగోడు: ఓ జంట పెళ్లి చేసుకుని పట్టువస్త్రాలతో పెళ్లి మండపం నుంచి నేరుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి అంబేద్కర్ ఆశీస్సులు పొందారు. మునుగోడు పట్టణానికి చెందిన బెల్లపు బాలశివరాజు అనే యువకుడితో నల్లగొండ పట్టణానికి చెందిన అన్నపూర్ణ అనే యువతితో మునుగోడు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వివాహమైంది. ఆ యువతీయువకుడికి అంబేద్కర్ అంటే అమితమైన ప్రేమ. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి కూడా కావడంతో వారు మూడుముళ్లతో ఏకమైన వెంటనే పెళ్లి పీటల మీది నుంచి లేచి అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ సంఘటన వీక్షించిన పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. అంబేద్కర్‌పై ఆ జంటకు ఉన్న అభిమానం చూసి అభినందించారు.

వివాహిత హత్య కేసులో నిందితుల రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి

తిప్పర్తి: వివాహిత హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కొదాటి శ్రీనుకు మిర్యాలగూడం మండలం బాదాలపురం గ్రామానికి చెందిన వాణితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లైన సంవత్సరం నుంచి భర్త కొదాటి శ్రీను, అత్తమామలు కన్నమ్మ, రాములుతో పాటు శ్రీను అన్న నాగరాజు, అతడి భార్య మౌనిక కలిసి ప్రతి చిన్న విషయానికి వాణితో గొడవపడి వేధింపులకు గురిచేసేవారు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఇటీవల వాణిని తీవ్రంగా కొట్టి ఇంట్లో నుంచి గెంటేశారు. నెల రోజుల క్రితం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి వాణిని తిరిగి కాపురానికి మామిడాలకు తీసుకొచ్చారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి శ్రీను వాణితో ఇంట్లో గొడవపడి మెడకు బెల్టుతో ఉరేసి సాధారణ మరణంగా చిత్రీకరించాడు. వాణి తల్లి సింగం నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టుమార్టం రిపోర్ట్ మేరకు హత్యగా నిర్ధారించుకొని శ్రీను, తల్లిదండ్రులు కన్నమ్మ, రాములు, అన్న, వదినలు కొదాటి నాగరాజు, మౌనికను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులకు జరిమానా

చౌటుప్పల్ రూరల్: మండలంలోని పంతంగి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వాహకులు బోయ దానయ్య, కొమ్మగోని సత్తయ్యకు రూ.లక్ష జరిమానా విధిస్తూ చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణ నోటీసులు జారీ చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. రెండు నెలల క్రితం వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినా తిరిగి మద్యం అమ్ముతుండడంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. తహసీల్దార్ ఆదేశాలను బేఖాతరు చేసినందుకు వీరికి నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల్లో జరిమానా చెల్లించకుంటే సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు.

హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు

చివ్వెంల(సూర్యాపేట): చేతబడి చేస్తున్నాడనే నెపంతో వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన రణపంగ రాములు చేతబడి చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన రణపంగ దానయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 2018 సెప్టెంబర్ 9వ తేదీ రాత్రి రాములు పశువులకు గడ్డి వేసి ఇంటికి తిరిగి వస్తుండగా దానయ్య దారిలో కాపుగాసి రోకలిబండతో రమణయ్య తల, ముఖంపై కొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాములును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కోడలు విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సూర్యాపేట రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడు దానయ్యకు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్లు కె. సురేంద్రబాబు, జి. శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్స్ పి. వెంకటేశ్వర్లు, ఎండీ. యాసిన్ సహకరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కర్నె వీరారెడ్డి

గరిడేపల్లి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం ఎల్బీనగర్‌లో శుక్రవారం జరిగింది. ఎల్బీనగర్ గ్రామానికి చెందిన కర్నె వీరారెడ్డి (45) తన పొలం వద్ద తూములో రాళ్లు ఉండడంతో జేసీబీ సాయంతో బయటకు తీయించాడు. ఈ రాళ్లను ఇనుప పైపుతో తొలగిస్తుండగా.. పైన 11 కేవీ విద్యుత్ తీగలకు పైపు తగిలింది. దీంతో వీరారెడ్డి స్పృహ కోల్పోయాడు. అతడిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వీరారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కేబుల్ కాంట్రాక్టర్..

మఠంపల్లి: కేబుల్ వైరు అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్టర్ మృతిచెందాడు. ఈ ఘటన మఠంపల్లి మండలం రఘునాథపాలెం వద్ద శుక్రవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడుకు చెందిన దేశినేని రామారావు(45) కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మఠంపల్లి మండలం రఘునాథపాలెం సమీపంలోని కిష్టాపురం, నక్కగూడెం తదితర గ్రామాలకు కేబుల్ లైన్ వేసేందుకు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. రామారావు శుక్రవారం రఘునాథపాలెం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైరు అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు

అభివృద్ధికి కుల వ్యవస్థే ఆటంకం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



అంబేద్కర్, పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రపంచంలో ఎక్కడాలేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉందని, కులవ్యవస్థే అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే, మాజీ జెడ్పీటీసీ కొంగరి భాస్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. కుల వ్యవస్థ ఉన్నత వర్గాలకు మేలు చేస్తే, అణగారిన కులాలకు మాత్రం కీడు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు జ్యోతిబాపూలే మహిళలకు చదువు కోసం కృషి చేస్తే, సమానత్వం కోసం బీఆర్ అంబేద్కర్ పాటుపడ్డారన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాకారుడు ఏపూరి సోమన్న, కౌన్సిలర్లు దారెడ్డి మంజులవేణురెడ్డి, కొంగరి కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ రేఖబాబూరావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తడక వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచంద్రం, ఎల్లమ్మ మైసయ్య, విగ్రహ కమిటీ చైర్మన్ కొండమడుగు రాజు, చైర్మన్ కొండమడుగు ఎల్లస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, తడక రమేష్, రావిరాల స్వామి, మర్రి నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కుక్క దానయ్య, మద్ది అంజిరెడ్డి, దేవమ్మ, మీసాల శ్రీనివాస్, కొండమడుగు కృష్ణస్వామి, బీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సందెన శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, కొమ్ము లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

గోశాల ధ్వంసం

ఆలేరురూరల్: ఆలేరు మున్సిపాలిటీలోని బహద్దూర్‌పేటలో శ్రీసారబుడ్ల, సావిత్రమ్మ లక్ష్మారెడ్డి గోశాల షెడ్డును, గోఉత్పత్తుల కేంద్రాన్ని శుక్రవారం కూళ్ల నర్సింహులు అతడి అనుచరులు ధ్వంసం చేశారని గోశాల కమిటీ సభ్యుడు మాజీ సర్పంచ్ జంపాల దశరథ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కందుల శంకర్ ఆలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం కలిగించారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో దయ్యాల సంపత్, ఉప్పల బీరప్ప, పత్తి వెంకటేష్, వస్పరి స్వామి, కమ్మంపల్లి కుమార్, ప్రశాంత్, చెక్క శేఖర్ ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గోశాల కమిటీ సభ్యులు



మువ్వన్నెల రంగుల్లో సాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్: ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై మువ్వన్నెల రంగులతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్ల వెలుగుల్లో సాగర్ ప్రాజెక్టు చూపరులను ఆకట్టుకుంది.

ఎరువుల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

పాడిపంట



నడిగూడెం మండలం నారాయణపురంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

నడిగూడెం : ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బోర్లు, బావుల కింద వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట సాగులో ఎప్పటికప్పుడు సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తేనే అధిక నాణ్యమైన పంట దిగుబడితోపాటు అధిక నూనె శాతం పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు. వేరుశనగలో అధిక దిగుబడికి పాటించాల్సిన పద్ధతులు ఆయన మాటల్లోనే..

ఎరువుల మోతాదు నిర్ణయించుకోవాలి

భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. ఆఖరు దుక్కిలో ఎకరానికి 3–4 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. విత్తనం విత్తే సమయంలోనే మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తనం నాటే సమయంలోనే వేసుకోవాలి. విత్తనం నాటిన 30 రోజుల తర్వాత తొలి పూత దశలో మరో 10–15 కిలోల యూరియా వేసుకోవాలి. ఎకరానికి 200 కిలోల జిప్సమ్‌ను పూత దశ పూర్తయి ఊడలు దిగే సమయంలో తప్పనిసరిగా మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి. విత్తనం విత్తిన 45 రోజుల తర్వాత ఎలాంటి అంతర సేద్యం చేయవద్దు. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించేందుకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్ర నాశినిని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి 10 రోజులు మాగబెట్టి ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. (యూరియాలో 46 శాతం నత్రజని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌లో 16 శాతం భాస్వరం, 12 శాతం గంధకం, 18–21 శాతం క్యాల్షియం, మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌లో 60 శాతం పొటాషియం ఉంటుంది.)

సూక్ష్మ పోషకాల లోపాలు–సవరణ

జింకు లోపించిన పైరులో ఆకులు చిన్నవిగా మారి మొక్కలు గిడసబారతాయి. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి 400 గ్రాములు జింకు సల్ఫేట్ 200 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో కనీసం రెండుమార్లు పిచికారీ చేయాలి. అలాగే ఇనుపధాతు లోపం నల్లరేగడి నేలల్లో అధిక తేమ ఉన్నప్పుడు కనిపిస్తుంది. లేత ఆకులు పసుపుపచ్చగా తర్వాత తెలుపు రంగుకు మారుతాయి. ఈ లోపాన్ని అధిగమించేందుకు ఎకరానికి రెండు కిలోల అన్నభేది, 200 గ్రా. సిట్రిక్ ఆమ్లం 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుమార్లు పిచికారీ చేసుకోవాలి.